
# అబ్బాయి మనసు

కేశిరాజు ఫణిప్రసాద్

''ఒరేయ్ రామం ఇక నేను బయలుదేరుతాను'' అంటూ రిస్ట్‌వాచీలో టైం ఉదయం తొమ్మిది గంటలు చూపిస్తుంటే కూర్చున్న చోటు నుంచి లేచాను!

''సరేరా శ్రీనూ! నీ ఇష్టం మనిద్దరం ప్రాణస్నేహితులం కాని చాలా కాలం తరువాత అనుకోకుండా కలుసుకున్నాం! మరో రెండు మూడు రోజులుండమని ఇప్పటికి ఎన్నో సార్లు అడిగాను.! కానీ నువ్వు మాత్రం వెళ్లాలి...వెళ్లిపోతానంటున్నావు'' రామం మాటల్లో నిష్టూరం!

మేమిద్దరం స్కూలులో స్నేహితులమయ్యాం! కాలేజీలో కూడా కలిసే చదువుకున్నాం! మా స్నేహం మాత్రం ఎప్పటికప్పుడు చిగురిస్తూనే వుంది.



''మనుషుల మధ్య బంధం, అనుబంధం కరివేపాకు లాంటివి. మనం కోసుకున్న కొద్దీ చిగురిస్తూనే వుంటుంది. మా స్నేహం పరిమళిస్తూనే వుంటుంది!''

ఒకసారి మాటల మధ్య మా స్నేహం గురించి రామం చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. రామం ఎన్నో పుస్తకాలు చదువుతూ వుంటాడు. ఏ విషయమ్మైనా భావయుక్తంగా చెప్పడం వాడికే చేతనవును.

మా ఇద్దరి చదువులు పూర్తయిపోయాయి. ఉద్యోగరీత్యా ఇద్దరం విడివిడిగా వుంటున్నాం. నేను హైదరాబాద్‌లో సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగిని. రామం విశాఖపట్నంలో యూనివర్సిటీ ప్రొఫెసర్. మా ఇద్దరికీ తరచుగా కలుసుకోవడం వీలుపడడం లేదు. ఉత్తరాల్లో కుశలం కనుక్కుంటూనే వుంటున్నాం. ఆఫీసు పని మీద విశాఖపట్నం వచ్చాను. బస్టాపులో అనుకోకుండా కలుసుకున్నాం. చుట్టుపక్కల వారిని కూడా మరిచిపోయి కౌగిలించుకున్నాం. కబుర్లు చెప్పుకుంటూ దగ్గర్లో వున్న కాఫీ హోటల్లో కూర్చున్నాం.

రాత్రి ఎనిమిది గంటలయింది! ''ఒరేయ్ శ్రీను ఈ రాత్రికి మా ఇంట్లో వుండు. రేపు పొద్దుటే వెడుదువుగాని'' వాడి మాటని కాదనడానికి మనసొప్పలేదు. ఇంటికెళ్లి భోజనాలయ్యాక వాకిట్లో మడతమంచాలు వేసుకొని మేము మాట్లాడుకున్న మాటలు ఎన్నెన్నో!

''ఒరేయ్ రామం....'' అనబోతున్నాను! ఈలోగా రామం కొడుకు లోపల్నించి వచ్చాడు. ''నాన్నా నాకు ఆఫీసుకి టైమయింది. నేను మీరు చెప్పిన మందులు సాయంత్రం తప్పకుండా తెస్తాను'' అంటూ తన కోసం వచ్చిన ఆఫీసు కారులో వెళ్లిపోయాడు!

నేను రామం కొడుకు వైపు చూస్తూ వుండిపోయాను. అనుకోకుండా మనసు కలుక్కుమంది.

పైకి చెప్పలేని స్థితిలో రాత్రి ఆ కుర్రాడిని చూసిన ప్పటి నుంచి నా పరిస్థితి అలాగే వుంది.

''ఇక వుండలేక వెళ్లొస్తాను'' నాకు తెలియ కుండా అన్నానామాట.

''ఒరేయ్ శ్రీను ఉన్నట్టుండి అలాగున్నావేంటి?'' రామం ఆరాటంగా అడుగుతుంటే సర్దుకోబో యాను. కాని నా వల్ల కాలేదు. విషయం తెలుసుకో వాలని రామం పట్టుబట్టాడు. నిస్సహాయంగా వాడిని చూశాను.

రామం కళ్లల్లో నీళ్లు. అంతే! ప్రయాణం మాను కున్నాను.

జీవితంలో మలుపులుంటాయని తెలుసు! మలుపుల్లో మార్పులు వుంటాయని తెలుసు! అన్నీ తెలిసిన నేను ప్రస్తుతం ఊహించని స్థితి నిజం! నా స్నేహితుడింట్లో ఇంత ఒత్తిడికి గురవుతానని ఊహించను కూడా లేదు. రామం కొడుకు రూపం నా కళ్ల ముందు కదులుతూనే వుంది. దృష్టిమరల్చ డానికి ఎన్నో విధాలుగా ప్రయత్నిస్తున్నాను. నా వల్ల కావడంలేదు. పైగా క్షణం క్షణం బాధ రెట్టింపు అవుతుంటే నా హృదయం కన్నీళ్లతో తడిసిపో తోంది.

రామం ఇంటి వాకిట్లో మంచం మీద పడు కొని ఆలోచిస్తున్నాను. రాత్రికి అన్ని విషయాలు మాట్లాడుకుందాం రా'' అన్న వాడి కోసం ఎదురు చూస్తున్నాను. ఇంతలో రామం వక్కపొడి తీసుకొని నా పక్కనే వున్న మంచం మీద కూర్చున్నాడు. నా చేతిలో కాస్త వక్కపొడి వేశాడు. అప్రయత్నంగా వాడినే చూస్తున్నాను. ఎంత ప్రశాంతంగా కనిపిస్తు న్నాడు. ఎంతో అదృష్టవంతుడు. నాలో నేనే అను కొన్నా. ఈలోగా మరచెంబులో నీళ్లు, మరో రెండు గ్లాసులు తీసుకొచ్చి మంచం దగ్గర ఒక స్టూలు మీద పెట్టాడు రామం కొడుకు!

అనుకోకుండా చూపు మరల్చుకున్నాను. వాడిని చూడడానికి కూడా ధైర్యం చాలడం లేదు.

ఇంట్లో వాళ్లందరూ పడుకున్నారు.! చుట్టుప క్కలంతా నిశ్శబ్దంగా వుంది.

ఇవ్వాళ పొద్దున 'ఇక నేను వుండలేనురా వెళ్లి పోతాను.' అనే మాట హఠాత్తుగా ఎందుకన్నావో కారణం తెలియడం లేదురా శ్రీను! కాని నువ్వు మనసులో బాధపడుతున్నావని అర్థమవుతోంది. తలగడని సర్దుతూ అన్నాడు. అసలు విషయం వివ రంగా చెప్పమన్న ఉద్దేశాన్ని వ్యక్తం చేశాడు. వాడి మాటల్లో అనునయం నా మనసుని మరింత బల హీనం చేసింది.

''మరేం లేదురా రామం! నీ కొడుకుని, వాడి ప్రవర్తనని నిన్న రాత్రి నుంచి చూస్తున్నాను. మీ అబ్బాయితో మా అబ్బాయిని పోల్చి చూసుకుంటు న్నాను. నా గుండెల్లో బాధని వ్యక్తం చేయడానికి నేను మాట్లాడిన ప్రథమ వాక్యం!

''ఓహో అదా విషయం! బావుంది! ఇంతకీ మీ వాడికి, మా వాడికి పోలిక కుదిరిందా? అటు తిరిగి పడుకున్నవాడు ఇటు తిరుగుతూ అడిగాడు.

''లేదురా! కుదరలేదు! కుదరదు కూడా'' గుండెల్లో తొలుస్తున్న బాధ గొంతులోకి తెచ్చు కుంటూ సమాధానం చెప్పాడు. ఈ మాటలంటు న్నప్పుడు నా కళ్లలో నీరు ! రామం చూడకుండా మరో వైపు తిరిగి కన్నీళ్లను తుడుచుకున్నాడు.

నా మాట వినగానే పడుకున్న వాడు కాస్తా వెంటనే లేచి నిల్చున్నాడు. సరిగ్గా అప్పుడే నేను కళ్లు తుడుచుకోవడం కూడా గమనించాడు.

''ఒరేయ్ శ్రీనూ... మావాడు, మీవాడు ఒక ప్పుడు కలిసి చదువుకున్నవాళ్లే! నువ్వే అనవస రంగా మా వాడి గురించి ఎక్కువగా ఊహించు కుంటున్నావు. ఇంతకీ ....

''మీ వాడు కుదురుగా చదువుకున్నాడు. మా సుపుత్రుడు చదువబ్బక చెడిపోయాడు'' అంటూ నా కొడుకు పరిస్థితి పూర్తిగా చెప్పాను!

విషయం తెలిశాక రామం నన్నే చూస్తూ ఏదో ఆలోచిస్తూ వుండిపోయాడు.

ఇంత సేపు ఆలోచిస్తున్నాడేమిటి? నాలో నేను అనుకుంటున్నాను. ఇక వుండలేక ''ఏమిరా మాట్లాడకుండా వుండిపోయావు? అంటూ నేనే వాడిని కదిపాను.''

''నువ్వు చెప్పింది మామూలు విషయం కాదురా! మన కుటుంబాల్లో ఎప్పుడూ జరగనిది, జరగకూడనిది! అందుకే ఇంతలా ఆలోచిస్తున్నాను. అంటున్న రామాన్ని చూసి ''ఆ రోజు నుంచి కొన్నేళ్ల వరకూ వీధిలో తలవంచుకొని తిరిగాను'' అప్పుడు నేను పడ్డ అవస్థల్ని గుర్తుచేసుకుంటూ మాట్లాడాను!

నా మాట విని, ''చూడు శ్రీను నాకు తెలిసి, అర్థం చేసుకున్న నిజం చెపుతాను. వింటావా?'' అలా అడుగుతున్న రామం మాటల్లోనూ, మాట్లా డేతీరులోనూ అనూహ్యమైన మార్పు హఠాత్తుగా వ్యక్తమవుతోంది. వింటానని నిశ్శబ్దంగా తలూ పాను. కాని నాలో ఏదో తెలియని అనుమానం.

''టెన్త్ క్లాస్ పరీక్ష ఫెయిలయ్యాడనే కోపంతో నీ కొడుకుని ఇంట్లోంచి గెంటేశావే! ఆలోచిస్తుంటే ఒక తండ్రిగా నువ్వు చేసింది చాలా పెద్ద తప్పు.''

''తప్పు చేశానా? నేను తప్పు చేశానా?'' రామం మాటలకు ఒప్పుకోలేని పరిస్థితిలో కాస్త గట్టిగానే మాట్లాడాను.

''ఒరేయ్ శ్రీను... నీ కొడుకు చదువు విష యంలో నువ్వు ఎప్పుడైనా తండ్రిగా నీ బాధ్యత నిర్వహించావా?''


రామం మాటలు నా వ్యక్తిత్వాన్ని వేలెత్తిచూపి స్తున్నాయి. అతి కష్టం మీద నన్ను నేను నిగ్రహించు కొని ''వాడు అడిగినన్ని పుస్తకాలు, నోట్ బుక్కులు కొనివ్వలేదా? మంచి స్కూలులో చేర్పించి మరీ చదివించాను. ఈ విషయంలో తండ్రిగా ఎవరైనా ఇంతకన్నా ఏం చేస్తారు?'' నా మాటల్లో ఉక్రోషం.

''ఇవన్నీ బాగానే వున్నాయి. ఎప్పుడైనా వాడు సరిగ్గా చదువుతున్నాడా? చెప్పిన పాఠాలు వాడికి అర్థం అవుతున్నాయా? అని ఆలో చించావా? ఈ రోజుల్లో ప్రతి స్కూలు వాళ్లు నెలకో సారి పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేస్తారు. ఒక్కసా రైనా నీ కొడుకు స్కూలుకు వెళ్లి పరిస్థితి తెలుసుకు న్నావా?

''మాట వెంట మాట, ప్రశ్న మీద ప్రశ్న. ఇలా గబగబా అడుగుతున్న రామాన్ని చూస్తూ... అకస్మాత్తుగా ఏదో జ్ఞాపకం.

ఆ రోజు శనివారం. నాకు ఆఫీసుకు సెలవు. ఉదయం ఎనిమిదిగంటలు. ఏదో పని మీద బయ టకి వెడుతున్నాను. ''ఏవండి అని మా ఆవిడ వసుధ పిలుపుకి వెళ్లబోతున్నవాడిని ఆగి ''ఏంటి వసుధ'' అంటూ విసుక్కున్నాను. ఎక్కడికైనా వెడు తుంటే వెనక్కి పిలిస్తే ఒళ్లుమండిపోతుంది. అదే మాట మా ఆవిడతో ఎన్నో సార్లు చెప్పాను. అయినా తన పద్ధతి తనదే.

''ఎందుకు పిలిచావు'' చిరాకుగా అడిగాను. ''ఇవ్వాళ రెండో శనివారం. మన అబ్బాయి చదివే స్కూలు వాళ్లు పేరెంట్స్ మీటింగ్‌కి రమ్మని డైరీలో



రాసి పంపించారు. ఎలాగో సెలవే కదా. ఒక్కసారి వాడి స్కూలుకి వెళ్లి టీచర్లను కలిస్తే బాగుంటుంది'' విషయం ఎంతో ఓపికగా చెప్పింది.

''చూడు వాడిని స్కూలులో సరిగ్గా చదివించాల్సింది స్కూలు మాస్టర్లు. అందుకు ప్రతి నెలా ఫీజులు కడుతున్నా! ఈ మీటింగ్‌లో ఏముంటుంది.అక్కడికెళ్లి వాళ్ల స్కూలుని, టీచర్లను పొగడాలి. ఇవన్నీ నాకు నచ్చవు.'' అంటూ వెళ్లిపోయాను.

శీనూ నా మాటకు జవాబు చెప్పలేదు. అన్నాడు రామం మాట్లాడలేని ఇరకాటం.

''నువ్వు చెప్పిన దాంట్లో అంతరార్థం అర్థం చేసుకుంటున్నాను.'' ఏదో ఒకటి మాట్లాడక తప్పదన్నట్లుగా మాట్లాడాను

ఒక్క క్షణం నావైపే చేస్తున్నాడు. అర్థమేమిటో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

''శ్రీనివాసరావు మంచి ఆఫీసర్. అతను బాగా పనిచేస్తాడు. అతని పనితనం చూసిన తోటి ఉద్యోగులు కూడా తాము కూడా అతని లాగే పని చెయ్యాలని అనుకొంటూ వుంటారు''

రామం మాటలు వింటుంటే నా మనసుకి ఎంతో హాయిగా వుంది.

''మీ అబ్బాయిని స్కూలుకి పంపిస్తున్నావు. టీచర్లు చదువు చెపుతున్నారు. అనుకుంటే చాలదు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రోగ్రెస్ గురించి పట్టించుకోవాలి. పిల్లల్ని ఇంట్లో టైమ్ ప్రకారం చదివించడం కూడా ఎంతో ముఖ్యం.''

మళ్లీ ఇలా మాట్లాడాడు. ఆ మాటల్లో పదును. ''నీ కొడుకు విషయంలో ఇంట్లో నీ ప్రవర్తన ఏమిటి?'' అంటూ నన్ను వేలెత్తి చూపిస్తున్నట్లు వుంది. అంతేకాదు మళ్లీ నాలో మరో సంఘటన కళ్లెదురుగా కదిలేటట్టు చేసింది.

ఆరోజు సాయంకాలం కొంచెం పెందరాళే ఇంటికొచ్చాను. బట్టలు మార్చుకొని కాళ్లు చేతులూ కడుక్కొని ఫ్రెష్‌గా కూర్చొని కాఫీ తాగుతున్నాను.

''నాన్నా..నాన్నా...'' అంటూ మా సుపుత్రుడు హడావుడిగా నా దగ్గరకి పరిగెట్టుకుంటూ వచ్చాడు. ఆరోజు వాడు చాలా సంతోషంగా వున్నాడు. ''ఏమిటో సంగతి'' అని అడగాలని అనిపించింది. కాని అడగలేదు. కాదు అడగాలని నాకెందుకో అనిపించలేదు.

''ఈసారి పరీక్షల్లో అన్నింట్లోనూ ఎక్కువ మార్కులొచ్చాయి. మా క్లాస్‌లో అందరికంటే ఫస్టు నేనే'' అంటూ ప్రోగ్రెస్ రిపోర్టు నాచేతికిచ్చాడు.

ప్రోగ్రెస్ రిపోర్టుని వెంటనే అందుకోకుండా ''మంచిదే. క్లాస్‌లో ఫస్ట్ వస్తే చాలదు. స్కూలుకే ఫస్టు రావాలి'' అని రిపోర్టు వాడికి తిరిగి ఇచ్చేసాను.

''క్లాస్ టీచర్ ప్రోగ్రెస్ రిపోర్టు మీద నీ సంతకం చేయించుకొని రేపు పట్టుకురమ్మంది'' సంతకం పెట్టమంటూ ఈసారి పెన్నుతో సహా మళ్లీ ఇచ్చాడు. ఈ మాత్రానికి నేను సంతకం చెయ్యక్కర్లేదు. వెళ్లి మీ అమ్మతో పెట్టించు. అనగానే ''ప్రోగ్రెస్ రిపోర్టు మీద మా ఫ్రెండ్స్ నాన్నల చేత సంతకం పెట్టించుకుంటున్నారు'' నా సంతకం కోసం వాడిలో ఎంతో తాపత్రయం.

''ఈసారి శ్రద్ధగా చదివాడు. అన్నింటిలోనూ నూటిని నూరు మార్కులే. మీరు రిపోర్టు చూడండి'' అక్కడికొచ్చిన మా ఆవిడ కూడా చెప్పింది.

''అదే పనికి రాదు. ఈ మాత్రానికే మనం పొగిడితే వాడు చెడిపోతాడు. ఎవరయితే ఏంటిలే. నువ్వు సంతకం పెట్టు'' అనగానే మా ఆవిడ ''పసి మనసుని మురిపించలేని మీరూ ఒక తండ్రేనా'' అనే భావనతో నన్ను చూసింది. బిక్కమొహం వేసుకొని కళ్లు తుడుచుకుంటూ మావాడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

ఈ సంఘటన ఎప్పుడో జరిగింది. ఇప్పుడు ఆ జ్ఞాపకంతో చెమ్మగిల్లుతోంది హృదయం.

మనిషికి జీవితంలో అనుకోనివి జరుగుతుంటాయి. అప్పుడు ఎంతటి వారైనా తన ప్రవర్తనను విశ్లేషించుకోవాలి. ఇది తప్పదు. నాలోని ఆలోచనలకు అతికినట్టుగా మాట్లాడుతున్నాడు రామం అనుకొని ఆశ్చర్యం. అంతలోనే నాలో మరో అనుమానం. కొంతకాలం క్రితం మా ఇంట్లో జరిగినవన్నీ రామం తను చూసినట్లుగా చెపుతున్నాడు ఎలా? అడుగుదామని అనిపిస్తోంది. కానీ అడగలేకపోతున్నాను.

''శీను మన చుట్టూ వున్న మనుషుల స్వభావాల వల్ల పరిస్థితులు ఎప్పటికప్పుడు ఎలా మారిపోతున్నాయో నువ్వెప్పుడైనా ఆలోచించావా?''

ఇలా అడుగుతాడని అనుకోని నేను ఒక్కసారి బిత్తరపోయాను.

''చదువుకోవడానికి స్కూలుకు వెళ్లిన పిల్లలు మళ్లీ ఇంటికి తిరిగొచ్చి మన కళ్లెదురుగా అగుపించే వరకు భయంగానే వుంటోంది. ఎందుకంటే అనూహ్యంగా జరుగుతున్న ప్రమాదాలలో పిల్లలు సైతం అమాయకంగా ఇరుక్కుపోతున్నారు.

రామం మాటలు వింటుంటే నాలో ఏదో కంగారు.

''అటువంటిది పరీక్ష తప్పాడని ఇంట్లోంచి పంపించి వేశావు. ప్రస్తుత స్థితిగతుల్లో నువ్వు ఎంత తప్పుచేశావో ఆలోచించావా? తల్లిదండ్రులు చేసిన తప్పులకు పిల్లలు తమ బాల్యాన్ని చిత్తుకాగితాలు ఏరుకుంటూ, పెంటకుప్పల్లో గడుపుతూ మరి కొంతమంది చెత్తకుండీల్లో పడేసిన ఎంగిలాకుల్లో మిగిలిన మెతుకులు తింటూ తమ ఆకలిని తీర్చుకుంటున్నారు. ఇంకాకొంత మంది పలుకుబడి వున్న గుండాలకు దొరికి ఏ దిక్కులేక వాళ్లు చెప్పినట్లుగా అక్రమ వ్యాపారాల్లో ఇరుక్కుపోతున్నారు. అంటే పసితనంలోనే జీవితం కష్టాల్లో చిక్కుకుపోతోంది. ఇలాంటి సమాజంలో..''ఒక్క క్షణం మాట్లాడడం ఆపాడు.


రామం మాటలు నన్ను వణికిస్తున్నాయి.

''ముందు వెనుక ఆలోచించకుండా నీ కొడుకుని....'' మాట పూర్తిచెయ్యకుండా ఉండిపోయాడు. మిగిలిపోయిన మాట నిశ్శబ్దంగా నా మనసుని కుదిపేస్తోంది.

''ఈరోజు నీ కొడుకు ఎక్కడున్నాడో చెప్పలేని గొప్ప తండ్రివి. నువ్వెంత గొప్పవాడివంటే నీ రక్తాన్ని నువ్వే ఏవగించుకోగలిగిన గుండె బలం కలవాడివి. నీ గొప్పతనం ఇంకా వుంది. ఊహ తెలుస్తున్న సమయంలో తల్లి తన పిల్లలకు తండ్రిని గుర్తుపట్టడం నేర్పుతుంది. అటువంటి కన్నతల్లి ''పాపం నా కొడుకు ఎక్కడున్నాడో తెలుసుకోండి'' అని కన్నీళ్లతో ఎన్నిసార్లు నిన్ను బ్రతిమాలుకుంది?. వాడి ఉనికినే అసహ్యించుకున్న నీవు ఆ తల్లి మనసుని అర్థం చేసుకోగలిగావా? కనీసం అర్ధాంగి హృదయానికి ఓ చిన్న ఓదార్పునివ్వగలిగావా?''

రామాన్ని చూస్తుంటే భయం! కోపంతో ఎర్రబడింది మొహం. మండిపోతున్న గుండెల్లోంచి మాటలు నిప్పుకణాల్లా బయటపడుతున్నాయి.

''ఒరేయ్ నువ్వు తండ్రివి! కాని తండ్రి



హృదయం లేని వాడివి! కాదు ఒద్దనుకున్నవాడివి. నువ్వు భర్తవి! కాని భార్యను ప్రేమించలేనివాడివి.''

నా స్నేహితుడి దృష్టిలో నేరస్థుడిని! నా ప్రాణ స్నేహితుడి సమక్షంలో నిలబడిన దోషిని! అందుకే తలవంచుకొని వుండిపోయాను.

ఇన్నాళ్లు నేను అనాలోచితంగా ప్రవర్తించానా? నా స్వభావం వల్ల నా భార్య తనలో తనే బాధపడుతోందా? నా కొడుకు గురించి సరిదిద్దుకోలేని తప్పుచేశాననే ఇంగిత జ్ఞానం నాకు లేకుండా పోయిందా?

రామం మాటలు విన్నాక నా మనసులో ఘర్షణ. ఆలోచనలు, ప్రశ్నలు మనసుని అతలాకుతలం చేస్తున్నాయి.

సమయస్ఫూర్తి లేని జీవితం నిన్నే కాదు నీ వాళ్లను కూడా బాధపెడుతుంది. అంతరాత్మ హితవు పలుకుతోంది.

''నువ్వు నీ కొడుకుని ఒదిలేసి ఎన్నాళ్లయిందిరా?'' రామం వేసిన ప్రశ్నకు ''ఇన్నాళ్లు అని చెప్పనా, ఇన్నేళ్లు అని చెప్పనా? అసలు ఏదైనా చెప్పడానికి వాడు వెళ్లిపోయాక వాడి రూపం కూడా ఊహించడానికి వ్యతిరేకిస్తూ బతికిన వాడిని. ఇదిరా నా మనస్తత్వం అని చెప్పనా''

హృదయం ఆవేదనతో మెలికలు తిరిగిపోతోంది.

''ఒరేయ్ ఇప్పటికైనా సవ్యంగా ఆలోచించడం నేర్చుకోరా. ఇక ముందైనా నువ్వు సుఖపడొచ్చు. నీ వాళ్లని సుఖపెట్టొచ్చు.'' అన్న రామాన్ని నిశ్శబ్దంగా చూస్తూ వుండిపోయాడు.

గతం తలచుకుంటున్న కొద్దీ మనసు శూన్యమైపోతోంది. ఈ స్థితిలో నా వాళ్ల గురించి కాదు కదా...కనీసం నన్ను గురించి కూడా ఆలోచన రాదు. 'నావాళ్లు' అనుకోగానే నాకెందుకో జ్ఞాపకం. హృదయాన్ని అణువణువునా తవ్వుతున్న జ్ఞాపకం!


'' ఒరేయ్ రామం నా కొడుకు ఎక్కడున్నదీ వెతికి తెచ్చుకోవాలనిపిస్తోందిరా. ఏదైనా మార్గం చెప్పరా'' ఎంతో ఆర్తితో అడిగాను.

నా వైపు చూశాడే తప్ప వాడు పెదవి విప్పలేదు. ''ఆ మాట అడగడానికి నీకు సిగ్గులేదురా'' అన్నట్టున్న వాడి మొహం చూస్తే నాకు కలుగుతున్న సందేహాలు!

''కొన్నేళ్ల క్రితం మన ఊరికి ఒక ముఖ్యమైన పని మీద వచ్చాను! స్టేషన్‌లో రైలు దిగి కాఫీ తాగుదామని ప్లాట్‌ఫారం చివర వున్న చిన్న కొట్టు వైపు వెళ్లాను. లోపలకెళ్లబోతూ చటుక్కున ఆగిపోయాను. బెంచి మీద కూచున్న కుర్రాడు కనిపించాడు. ఎక్కడో చూసినట్టుగా అనిపించడంతో దగ్గరికెళ్లాను. అక్కడ వున్నది ఎవరో కాదు... నీ కొడుకు.''

రామం అలా అనగానే గుండెను నా చేతులతోనే కర్కశంగా పిండుతున్నట్టయింది.

''ఎప్పుడో చిన్నతనంలో చూశాను. నేనెవరో చెప్పి పలకరించాను. పాపం వెంటనే నన్ను పట్టుకొని భోరుమని ఏడ్చేశాడు. నా చేతులతో పొదివిపట్టుకొని నాతోపాటే లోపలకి తీసుకెళ్లాను. మాసిపోయిన బట్టలు, నీరసంతో వేలాడిపోతున్న వాడిని వేడి నీళ్లతో మొహం కడిగించాను. ''ఏం తింటావురా'' అడగ్గానే వాడి కళ్లల్లో నీళ్లు. అదే క్షణంలో నా కళ్లలో కూడా నీళ్లు. కడుపు నిండాక వాడిలో ఓపిక వచ్చింది. మనిషి తెప్పరిల్లాడు. జరిగిన విషయం వివరంగా చెప్పాడు. వాడి మాటలు వింటూ వాడి వైపే చూస్తున్నాను. తనకెవరున్నారనే భయం స్పష్టంగా కనిపిస్తోంది. ఊళ్లో పనులు పూర్తిచేసుకొని వాడిని కూడా నాతో తీసుకొచ్చేశాను.'' అంటూ రామం చెప్పడం పూర్తిచేశాడు. ఏదో అడగాలని అనిపిస్తోంది. ''ఒద్దు అడగకు'' ఓడిపోయిన మనసు గొణిగింది. ఏమిటి నా జీవితం. అసలు నేను నిజంగానే జీవిస్తున్నానా? రామం మాటలు




నా ఆలోచనల మీద చూపిస్తున్న ప్రభావం.

''ఒరేయ్.. శీను... ఈ ప్రపంచంలో ఏ ఇద్దరు మనుషులు ఒక్కలాగే ఆలోచించరు. అలా ఆలోచిస్తే మంచికి చెడుకి తేడా తెలియదు. ఇంకా చెప్పాలంటే సమాజం స్తబ్దుగా మిగిలిపోతుంది. ఏ ఒక్కరిలోనూ చైతన్యం కలగదు''

అలా మాట్లాడుతున్న రామంలో వాడు కనిపించడం లేదు. వాడిలో ఓ మేధావి గోచరిస్తున్నాడు.

''రామం ఇంత వరకు నువ్వు మాట్లాడావు. ఇప్పుడు నిన్ను ఒక మాట అడిగేందుకు అవకాశమివ్వు.'' అభ్యర్థన పూర్వకంగా మాట్లాడాను.

సరేనని తలూపాడు. అది చాలు నాకు. ''నువ్వు చెప్పింది విన్నాక నేను చేసినవన్నీ తప్పులేనని అర్థమయింది. అంటే ఒక తండ్రిగా...''

''నీ కొడుకు గురించి తెలుసుకోవాలని అనుకుంటున్నావా?'' రామం మాటలకు అవునని తలూపాను. ప్రస్తుతం నాది మాట్లాడలేని పరిస్థితి.

వెంటనే మాట్లాడని రామం వైపు చూస్తున్నాను. ఆశగా చూస్తున్నాను.

''నీకొడుకుని నాతోపాటు తీసుకొచ్చాను. కాని వాడి సంగతి నేను పట్టించుకోలేదు. కొన్ని రోజులు వాడు ఏం మాట్లాడకుండా వున్నాడు. స్కూలు నుంచి రాగానే మా వాడు ముందు హోంవర్క్ చేసుకుంటూ కూర్చునేవాడు. ఏ టైంలో ఎలా వుండాలో చిన్నప్పటి నుంచి వాడికి నేను, మా ఆవిడ అలవాటు చేశాం. వాడు పుస్తకాలు ముందేసుకొని చదువుకుంటూ వుంటే మీ వాడు కూడా పక్కనే కూర్చునేవాడు. ఇలా కొంతకాలం గడిపాడు.

అటు తరువాత...నాలో తెలియని ఆరాటం.

ఒకరోజు రాత్రి పడుకోబోతుంటే ''అంకుల్ నాకూ చదువుకోవాలని వుంది. పగటిపూట చదువుకుంటూ రాత్రి పూట ఏదైనా పనిచేస్తాను'' అన్న మాటలకు నాలో ఒక్కసారి ఉలికిపాటు. ఇటువంటి వయసులో రాకూడని ఆలోచన. కాని వాడికి ఆ ఆలోచన కలగడానికి వాడున్న పరిస్థితి. తనకెవరూ లేరనే ఒంటరితనం. కాని చదువుకోవాలనే ఆలోచన బలంగా వుంది.

''ఒరేయ్ చందూ! నువ్వు చదువుకుంటానంటే నిన్ను నేను స్కూల్లో చేర్పించి మా అబ్బాయిలాగానే చదివిస్తాను. అంతేకాని పనిచేస్తాననడం నేరం'' అని నచ్చచెప్పాను. ఆ మరునాడే వాడిని స్కూలులో చేర్పించాను. మీ వాడు కష్టపడి చదివి మెరిట్‌లో పాసయ్యాడు.'' అని నన్నే చూస్తున్నాడు.

రామం నాకు స్నేహితుడుగా దొరకడం ఒక అదృష్టం. కృతజ్ఞతాభావంతో ఆరాధనగా చూస్తూ అనుకున్నాను.

''చూడు శ్రీను నేను మీ అబ్బాయిని చదివించింది నా స్నేహితుడి కొడుకనే ఉద్దేశంతోనే కాదు. నాన్నలందరూ నీలాగే వుంటారనే అపోహ వాడిలో వుండడం నాకిష్టం లేదు'' మృదువుగా మాట్లాడినా, ఆ నిజం కర్కశంగా వుంది.

''మనిషి జీవితం పుస్తకం లాంటిది. ఎన్నిసార్లు చదివినా పరమార్థం అర్థం కాదు. నీ

కొడుకు బ్రతుకు పుస్తకంలో నువ్వు రాసిన పేజీలో గతం మాత్రమే వుంది. కాని తన బ్రతుకు పుస్తకంలో చక్కటి భవిష్యత్తు రాసుకునే స్ఫూర్తి కలిగించాను'' చివరి మాట నొక్కి మరీ చెప్పాడు.

''సరే.. ఇక పడుకో మిగిలిన విషయాలు తర్వాత మాట్లాడుకుందాం'' రామం పడుకున్నాడు.

నాలో ఏదో తెలియని స్థబ్దత. అంతరంగంలో కదలిక. ఈ క్షణం నుంచి నేను మారాలి. మారిన జీవితం నాకు కావాలి. ఈ నిర్ణయంతో కళ్లు మూసుకున్నాను. తెల్లవారింది. రామం, నేను వీధి వరండాలో కూర్చుని కాఫీ తాగుతున్నాం. నేను వాడినే చూస్తూ కాఫీ తాగుతున్నాను. మనసులో భావాన్ని చూపుల్లో నింపుకొని మరీ చూస్తున్నాను. జీవితానికి కోరేది స్నేహం అనుకుంటూ కృతజ్ఞతతో వాడికి హృదయ పూర్వకంగా నమస్కరిస్తున్నాను.

వీధిగేటు దగ్గర చప్పుడయింది. ఎవరో వచ్చినట్టున్నారు అనుకుంటూ అటువైపు చూశాను. రామం కొడుకు, వాడికి వెనుకనే మరో అబ్బాయి.

రెప్ప వేయడం కూడా మానేసి అటే చూస్తూ వుండిపోయాను.

''ఎప్పుడొస్తారా అని ఎదురుచూస్తున్నాను. రండి రండి'' అంటూ రామం ఎదురెళ్లి ఆ అబ్బాయి చెయ్యి పట్టుకున్నాడు. అందరూ లోపలకి వస్తున్నారు.

నాకు తెలియకుండా నేనూ లేచి నిల్చున్నాను. ''ఒరేయ్ శీను ఇతను చందూ. కాదు కాదు మిస్టర్ చంద్రశేఖర్. బ్యాంక్ ఆఫీసర్. అన్నట్టు ఒరేయ్ చందూ ఇతను శ్రీనివాసరావు గారని... చెప్పుతూ టక్కున ఆపేశాడు.

''నాన్నా...నాన్నా... అంటూ నన్ను చుట్టేశాడు నా కొడుకు చందు. ఆ క్షణంలో మమ్మల్ని మేము ఎలా పలకరించుకోవాలో తెలియని స్థితిలో మా ఇద్దరి కళ్లు నీళ్లతో నిండిపోతున్నాయి.

కొద్ది క్షణాల తరువాత ఇద్దరం తెప్పరిల్లాం. అందరం కలిసి కూర్చున్నాం.

''శీను, నీ కొడుకు ఇలా ఎదిగి నీ ముందు నిలబడ్డాడు. నేను కోరుకున్నది అదే. అయితే వాడి విషయంలో ప్రత్యేకించి నేను ఎటువంటి శ్రద్ధ తీసుకోలేదు. నా మాట మీద గురి కుదిరేటట్టుగా ప్రవర్తించాను. జీవితానికి ఒక లక్ష్యం వుండేటట్టుగా వాడిని ప్రోత్సహించాను. ఈ సందర్భంగా ఒక ముఖ్య విషయం మాట్లాడాలి.

మా అందరిలో కుతూహలం. ''ఈ కాలంలో తల్లిదండ్రులుగా పిల్లలకి మనం ఇవ్వగలిగింది, ఇవ్వవలసింది మంచి పెంపకం, మంచి చదువు. ఇంతకు మించిన ఆస్తి మరేది లేదు. తల్లిదండ్రులకు ఈ అవగాహన వుంటే చాలు. మరో సంగతి మనం పాఠాలు చదివి పరీక్షల్లో నెగ్గాం. కానీ నీ కొడుకు చిన్నతనంలోనే ఎన్నో పరీక్షల్లో నెగ్గి బ్రతుకు పాఠం నేర్చుకున్నాడు.''

అంటూ రామం నా కొడుకునే చూస్తున్నాడు. నేను కూడా వాడినే చూస్తున్నాను. ''అసలైన మనిషి'' వాడిలో నాకు కనిపిస్తున్నాడు. పుత్రోత్సాహంతో నా హృదయం పదే పదే పరవశించిపోతోంది.

''ఒరేయ్ మీ వాడు చందూ పరమ దుర్మార్గుడు. పైగా పిసినారి.'' హఠాత్తుగా అన్న రామం వైపు ఉలిక్కిపడి చూశా. చక్కగా చదువుకున్నాడు. మంచి ఉద్యోగం చేస్తున్నాడు. మా ఇంట్లోనే వుండమని ఎన్నిసార్లు అన్నా విడిగా ఒక రూమ్‌లో వుంటున్నాడు. అదీకాక తన అవసరాలకు కూడా డబ్బు ఖర్చుపెట్టడు. ఇంటి కోసం నువ్వు తీసుకున్న అప్పు జీతంలోంచి వాడే కడుతున్నాడు. అదేమిటిరా అంటే నా బాధ్యత అంటున్నాడు'' మాట్లాడుతూ మా అబ్బాయిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకొన్నాడు.

మావాడినే చూస్తున్నాను. తండ్రిగా వాడి గతం గురించి మాత్రమే ఆలోచించాను. మరి వాడు..? కొడుకుగా భవిష్యత్ గురించి ఆలోచించాడు.

అంతరంగంలో ఒక చైతన్యం.

★

